

సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ
విద్యార్థులు, యువత వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. - 8లో



పోటెత్తిన భక్తులు
యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి క్షేత్రానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 40°/26°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్సీ గురుకులాల్లో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

నల్లగొండ : సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందడానికి ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ నెల 20లోగా ఆన్‌లైన్ tgswreis.telanga na. gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 7995010667 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది కలగొద్దు

కేతేపల్లి : రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా పౌర సరఫరాల డీఎం జె.హరీష్ ఆదేశించారు. కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 5.07 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం 17,729 టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.903 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట కేతేపల్లి ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఏఓ బి.పురుషోత్తం, ఆర్ఐ రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ జిల్లా కమిటీ ఎన్నిక

నల్లగొండ టూటౌన్ : ప్రభుత్వ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ టీచర్స్ జిల్లా కమిటీని శనివారం నల్లగొండలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రూపవత్ రవినాయక్, ప్రధాన కార్యదర్శిగా రమావత్ శ్రీనునాయక్, ఉపాధ్యక్షులుగా రుపావత్ అనంతరాములు, వెంకటరెడ్డి, బ్రహ్మచారి, కోశాధికారిగా జిలకర భాస్కర్, కార్యదర్శులుగా ఆర్.వెన్నెల, పి.రూప, ఎం.అనితను ఎన్నుకున్నారు.

పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న శంకర్‌నాయక్

నల్లగొండ: నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. కోర్టు ఎదురుగా ఉన్న మెలోడీ భవనం స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చలపతిరావు ఉన్నారు.

జ్యూరీ మెంబర్‌గా మిర్యాలగూడ వాసి



జ్యూరీ మెంబర్‌గా ఎంపికైన వాకిటి మధు

మిర్యాలగూడ : గద్దర్ ఫిలిం అవార్డ్స్–2025 కమిటీలో జ్యూరీ మెంబర్‌గా మిర్యాలగూడకు చెందిన సీనియర్ జర్నలిస్టు వాకిటి మధును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గతంలో రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థలో మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయిన ఆయన రాష్ట్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడిగా కూడా ఉన్నారు. మిర్యాలగూడ డివిజన్‌లో 1979 వరకు ఓ దినపత్రికలో రిపోర్టర్‌గా, సబ్ ఎడిటర్‌గా పనిచేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర అభివృద్ధి సంస్థలో మేనేజర్‌గా చేరారు. ఉద్యోగ విరమణ అనంతరం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. అవార్డు జ్యూరీ సభ్యులుగా మధు ఎంపికపై స్థానిక జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

సహకార డ్రోన్‌లు



ఏఐఎఫ్ పథకం కింద పీఏసీఎస్‌లకు సబ్సిడీ ద్వారా అందజేత

- రైతులకు ప్రయోజనం కలిగేలా తక్కువ ధరకే మందుల పిచికారీ
- సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టికి దోహదం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 107 సంఘాలకు ప్రయోజనం

నల్లగొండ అగ్రికల్చర్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) డ్రోన్‌లను అంజేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్(ఏఐఎఫ్) పథకం కింద వాటిని సబ్సిడీపై సంఘాలకు అందజేయనుంది. ఉమ్మడి జిల్లాలోని 107 సహకార సంఘాలకు వానాకాలం సీజన్ నాటికి డ్రోన్‌లను అందజేసి రైతుల వరి, పత్తి చేలకు పురుగుల మందులను పిచికారీ చేయించే విధంగా డీసీసీబీ పాలకవర్గం ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే డీసీసీబీ పాలకవర్గం ఆయా డ్రోన్ కంపెనీలతో సంప్రదింపులు చేపట్టింది. కంపెనీల నుంచి టెండర్లను పిలిచి తక్కువ ధరకు క్వాలిటీ డ్రోన్‌లను ఇచ్చే కంపెనీలకు సరఫరా బాధ్యతలను అప్పగించనుంది.

ఆర్థికంగా పరిపుష్టి సాధించనున్న సంఘాలు..
జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి సహకార సంఘాలకు డ్రోన్‌లను సబ్సిడీపై అందజేయడం ద్వారా ఆయా సంఘాలను ఆర్థికంగా పరిపుష్ట చేయాలన్న లక్ష్యంతో బ్యాంకు పాలకవర్గం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ప్రస్తుతం మార్కెట్‌లో డ్రోన్‌ల వ్యాపారులు ఎకరాకు రూ.500 చొప్పున తీసుకుంటున్నారు. కానీ సహకార సంఘాల డ్రోన్ల ద్వారా మందులను పిచికారీ చేస్తే ఎకరానికి రూ.300 చొప్పున ధరను నిర్ణయించనున్నారు. దీంతో రైతులకు తక్కువ ధరకే మందులను పిచికారీ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అదే విధంగా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉంటుంది. రోజూ పది గంటలపాటు మందులు పిచికారీ చేసినా రూ.30 వేల వరకు సంఘాలకు లాభం చేకూరే అవకాశం ఉంటుంది. అదేవిధంగా ఆయా సంఘాల్లోని డ్రోన్‌లను ఆపరేట్ చేసేందుకు నిరుద్యోగులకు కూడా ఉపాధి లభిస్తుంది.

రైతులకు ప్రయోజనం



కేంద్ర పభుత్వ ఏఐఎఫ్ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలకు డ్రోన్లను సబ్సిడీపై అందజేయాలని నిర్ణయించాం. డ్రోన్ల ద్వారా మందులను తక్కువ ధరలో పిచికారీ చేయడం వల్ల రైతులకు ప్రయోజరం కలుగుంది. సంఘాలకు లాభాలు వస్తాయి. వానాకాలం సీజన్ వరకు డ్రోన్‌లను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

సంఘానికి ఒకటి లేదా రెండు..

జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి 107 సంఘాలకు సభ్యుల సంఖ్య ఆధారంగా ఒక్కో సంఘానికి ఒకటి లేదా రెండు డ్రోన్‌లను సబ్సిడీ అందజేయాలని పాలకవర్గ నిర్ణయించింది. సంఘాల డిమాండ్ మేరకు రాబోయే వానాకాలం నుంచే డ్రోన్‌లను సరఫరా చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

శిక్షణతో మెరుగైన బోధన అందించాలి



వృత్తి నైపుణ్య శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో డీఈఓ భిక్షపతి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : వృత్తి నైపుణ్యం కోసం ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు మెరుగైన పద్ధతిలో బోధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లకు, జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. డీఈఓ భిక్షపతి మాట్లాడుతూ ఈనెల 17 వరకు మొదటి విడత, 20 నుంచి 24 వరకు రెండవ విడత, 27 నుంచి 30 వరకు మూడవ విడత శిక్షణ ఉంటుందని తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఇక్కడ శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు ఆయా పాఠశాలల పరిధిలో ఎంపిక చేసిన ప్రాంతంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్లు నల్లగొండ ఎంఈఓ అరుంధతి, నకిరేకల్ ఎంఈఓ నాగయ్య, చిట్యాల ఎంఈఓ సైదయ్య పాల్గొన్నారు.

విత్తన సరఫరాలో డీలర్ల పాత్ర కీలకం



డీలర్లకు ఈ పాస్‌లను అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

రామగిరి(నల్లగొండ) : రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందించడంలో డీలర్ల పాత్ర ప్రధానమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం నల్లగొండ సమీపంలోని పానగల్లు రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన డీలర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడరాు. విత్తనం విషయంలో డీలర్లు రైతులను ప్రలోభాలకు గురి చేయవద్దన్నారు. రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు రైతులకు ఇచ్చే విత్తనాలను అవసరమైతే వ్యవసాయ పరిశోధన కేంద్రాలలో తనిఖీ చేయించుకోవాలని సూచించారు. దుకాణం ముందు ఎమ్మార్పీ ధరలకు విత్తనాలను అమ్మే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. కోరమండల్ కంపెనీ టెక్నికల్ స్టాఫ్‌ను పెంచాలని, వారు అందజేసే ఈ –పాస్‌లో ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే అధిగమించే విధంగా కృషి చేయాలన్నారు. గడిచిన యాసంగి సీజన్‌లో 5.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 5.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ మాట్లాడుతూ వచ్చే వానాకాలం జిల్లాల్లో 11 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని.. అందుకు అనుగుణంగా విత్తనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా వంద మంది విత్తన డీలర్లకు ఈ పాస్ యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరమండల్ కంపెనీ సీజీఎం వెంకటేశ్వర్లు, విత్తన డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, రామ్మూర్తి, రవి, రాజేందర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనకు కేరాఫ్.. కేజీబీవీ

- ఇంగ్లిష్ మీడియంలో బోధన.. సకల వసతులు
- ఆరో తరగతిలో అడ్మిషన్లు ప్రారంభం
- జిల్లాలో 27 విద్యాలయాలు



కేతేపల్లి మండలం చెర్కుపల్లిలోని కేజీబీవీ

కేతేపల్లి : పేద, వెనుకబడిన, మధ్యలో బడిమానేసిన బాలికలకు విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)ను నెలకొల్పింది. తల్లిదండ్రులు లేని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినులకు ఉన్నత చదువులు అందించాలనేదే వీటి లక్ష్యం. ఈ విద్యాలయాల్లో ప్రవేశం పొందిన వారికి ఉత్తమ బోధనతోపాటు క్రమశిక్షణ, సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. సొంత భవనాల్లో ఉచిత వసతితో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించటం ఈ విద్యాలయాల ప్రత్యేకత. ఆరో తరగతిలో చేరితే ఇంటర్మీడియట్ వరకు చదువుకునే అవకాశం ఉండటంతో ఈ విద్యాలయాల్లో చేరేందుకు బాలికలు ఆసక్తి చూపుతున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని కేజీబీవీల్లో 6వ తరగతిలో ప్రవేశ ప్రక్రియ ప్రారంభించారు.

ప్రతి తరగతిలో 40 మంది..
జిల్లాలో మొత్తం 27 కేజీబీవీలు ఉన్నాయి. ప్రతి తరగతిలో 40 మంది విద్యార్థినులు ఉంటారు. ఇప్పటికే ఆరో తరగతిలో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీలు ఉంటే ప్రవేశాలు కల్పిస్తున్నారు. అదే విధంగా ఇంటర్మీడియట్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ, సీఈసీ కోర్సుల్లో 40 మంది చొప్పున విద్యార్థినులకు ప్రవేశం ఉంటుంది.

ప్రవేశాలు ఇలా..

కేజీబీవీలో ప్రవేశాలకు సంబంధించి మొదట తల్లిదండ్రులు లేని పేద విద్యార్థినులకు ప్రాధాన్యం ఉంటుంది. తర్వాత మిగిలిన విద్యార్థినులకు ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవేశాల కోసం విద్యార్థినులు 5వ తరగత వరకు చదువుతున్న బోనఫైడ్, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలి.

భవిష్యత్‌లో ఉపాధి పొందేలా..
కేజీబీవీల్లో విద్యార్థినులకు అన్ని వసతులు కల్పించడం, మెనూ ప్రకారం ఆహారం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందిస్తారు. ఇక్కడ ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. కేవలం చదువు మాత్రమే కాకుండా భవిష్యత్‌లో విద్యార్థినులు ఉపాధి పొందేలా కుట్లు, అల్లికలతో పాటు కంప్యూటర్ శిక్షణ, మార్షల్ ఆర్ట్స్‌పై తర్ఫీదు సైతం ఇస్తారు. వివిధ రకాల వృత్తి విద్యా కోర్సులు కూడా వీటిలో అందుబాటులో ఉన్నాయి.

సర్వేయర్ శిక్షణకు 350 దరఖాస్తులు

నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతి చట్టం అమలులో భాగంగా ప్రతి వ్యవసాయ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఉన్న సర్వేయర్లు ఆ సర్వేకు సరిపోకపోవడంతో లైసెన్స్ ఉన్న సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి వారిని సేవలు ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా.. జిల్లా నుంచి 350 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఈ నెల 26వ తేదీ నుంచి 50 రోజుల పాటు శిక్షణ ఇవ్వనుంది. పది రోజులు కార్యాలయాల్లో, మిగిలిన 40 రోజులు క్షేత్రస్థాయిలో సర్వే ఏ విధంగా నిర్వహించాలనే విషయంపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తయిన లైసెన్స్‌లు జారీ చేసి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వనుంది.

22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ : ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 22 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ దస్రూనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షలకు 36 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రాక్టికల్స్ జూన్ 3 నుంచి 6వ తేదీ వరకు ఉంటాయని.. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం నిర్వహిస్తామని తెలిపారు.

మరమ్మతులు మరిచారు!



నిడమనూరు : సాగర్ ఎడమకాల్వపై ప్రధాన కాల్వల్లో ఒకటైన ముదిమాణ్యం మేజర్ కింద 25,624 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ కాల్వకు 410 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. నీటి విడుదల చేసే తూము వద్ద కాల్వకు పెద్ద గొయ్యి ఏర్పడింది. నీరు ఎక్కువగా విడుదలైన సమయంలో కోతకు గురైంది. అప్పట్లో మరమ్మతులు చేసేందుకు వీలు కాలేదు. ప్రస్తుతం సాగర్ ఎడమకాల్వ నీటి విడుదల నిలిపివేసి నెల రోజులవుతోంది. కానీ అధికారులు ఆ గొయ్యిని పూడ్చేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

విద్యుత్‌శాఖ ముందస్తు సన్నద్ధం

నాణ్యమైన విద్యుత్ అందించేలా మరమ్మతులు

- కరెంట్ తీగలను తాకుతున్న చెట్ల తొలగింపు
- వేలాడుతున్న విద్యుత్ తీగల బిగింపు
- శిథిలావస్థలో ఉన్న స్తంభాల మార్పు
- వచ్చే వానాకాలంలో ఇబ్బందులు కలగకుండా ప్రణాళిక



మిర్యాలగూడలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం



తిప్పర్తి సమీపంలో హైవే వెంట విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లు నరికిన సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్ : విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేలా విద్యుత్‌శాఖ ముందస్తు మరమ్మతులు చేపడుతోంది. రాబోయే వర్షాకాలంలో విద్యుత్ వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికా బద్ధమైన విధానాల ద్వారా లోపాలను సరి చేస్తోంది. ప్రతీ వేసవి కాలంలో విద్యుత్ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపడుతుంది. ప్రస్తుతం ట్రాన్స్‌కో అధికారుల ఆధ్వర్యంలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ల వారీగా సరఫరా వ్యవస్థను మెరుగు పర్చుతున్నారు. వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి.

జిల్లాలో 172 విద్యుత్ సబ్‌స్టేషన్లు..
జిల్లాలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 172 ఉండగా, 133 కేవీ సబ్‌స్టేషన్లు 16 ఉన్నాయి. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ఉండేలా అవసరమైన మరమ్మతులు చేపడుతున్నారు. లోపాలను తెలుసుకునేందుకు ఇప్పటికే పూర్తిస్థాయి సర్వే నిర్వహించిన అధికారులు ప్రస్తుతం వ్యవస్థ మెరుగుదలకు కసరత్తు చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా ప్రాంతాల సబ్‌స్టేషన్ల విద్యుత్ సిబ్బంది గ్రూపులుగా విడిపోయి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహణ వ్యవస్థను పర్యవేక్షిస్తుండగా ఈ నెల చివరి వరకు పనులు పూర్తి అవుతాయని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

పాతవి తొలగించి.. కొత్తవి అమర్చుతూ..

విద్యుత్‌శాఖ ముందస్తు మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ తీగలకు తగిలే చెట్టుకొమ్మలను తొలగిస్తున్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను టైట్ చేస్తున్నారు. కూలిపోయే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని అమర్చుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిర్వహణ వ్యవస్థ మెరుగుదలకు అవసరమైన మార్పులు, చేర్పులు చేస్తున్నారు. మరమ్మతులకు గురైన ఫ్యూజ్ బాక్స్‌లను తొలగించి కొత్త వాటిని అమర్చుతున్నారు. బలహీనంగా మారిన విద్యుత్ తీగల స్థానాల్లో సామర్థ్యం గల తీగలను బిగిస్తున్నారు.

పకడ్బందీగా పనులు



అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు పకడ్బందీ పనులు చేపడుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నాం. క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు చేపడుతూ లోపాలను సవరిస్తున్నాం. సిబ్బంది సమన్వయంతో పని చేస్తే విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా కరెంట్ అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాసచారి, ట్రాన్స్‌కో డీఈ, మిర్యాలగూడ

ఈదురు గాలి బీభత్సం

పెద్దవూర : పెద్దవూర మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులు, వర్షం బీభత్సం సృష్టించాయి. మండలంలోని చింతపల్లి, ముసలమ్మచెట్టు, చింతపల్లి స్టేజీ, తెప్పలమడుగు గ్రామాల్లో ఎన్నడూ లేనంతగా ఈదురుగాలులు వీయడంతో ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. చింతపల్లి గ్రామంలో చెట్లు విరిగి ఇళ్లపైన పడ్డాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో రాత్రంతా ప్రజలు జాగారం చేయాల్సి వచ్చింది. గ్రామంలోని భక్తంజనేయ స్వామి దేవాలయం ముందున్న వేప చెట్టు కూలిపోయి ప్రహరిపై పడటంతో గోడ కూలిపోయింది. గ్రామానికి వచ్చే రహదారులపై చెట్లు విరిగి పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక నేతలు జేసీబీ సాయంతో రోడ్లపై పడిన చెట్లను తొలగింపజేశారు. చింతపల్లి స్టేజీ సమీపంలోని బట్టుగూడెం గ్రామానికి చెందిన ఓ రైతు డ్రాగన్ తోటలో ఇంటిపైకప్పు రేకులు లేచి చాలా దూరంలో పడిపోయాయి. దీంతో ఇంట్లో ఉన్న సామగ్రి అంతా తడిసి పోయింది. ట్రాన్స్‌ఫార్మర్ సైతం కింద పడిపోయింది. మామిడి కాయలు రాలిపోయాయి. ముసలమ్మచెట్టు స్టేజీ వద్ద ఓ ఇంటిపై వేసిన రేకుల షెడ్డు ఎగిరిపోయి పక్కంటిపై పడటంతో ఆ ఇంటి రేకులు పగిలిపోయాయి. ఈదురుగాలుల దాటికి భారీ నష్టం వాటిల్లిందని ప్రజలు పేర్కొంటున్నారు.



చింతపల్లిలో వేపచెట్టు విరిగి పడడంతో కూలిన ఆలయ ప్రహరీ



లేచిపోయిన ఇంటిపైకప్పు రేకులు



చింతపల్లిలో విరిగిన విద్యుత్ స్తంభం

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని ఇండస్ట్రియల్ పార్కు వెనుక శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 42 నుంచి 45 ఏళ్ల మధ్యన ఉంటుందని, అతడి కుడి చేతిపై అనుశ్రీ అని పచ్చబొట్టు ఉందని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పోలీసులు పేర్కొన్నారు. మృతుడు వడదెబ్బతో లేదా ఇతర అనారోగ్యంతో మరణించి ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక నిర్ధారణ చేసినట్లు తెలిసింది. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాపేట: కడుపునొప్పితో బాధపడుతూ పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ ఘటన రాజాపేట మండలం చల్లూరు గ్రామంలో శనివారం జరిగింది. వివరాలు.. చల్లూరు గ్రామానికి చెందిన గుంటి అశోక్(47) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ అతడు చికిత్స చేయించుకుంటున్నాడు. ఈ నెల 9వ తేదీ ఉదయం అశోక్ తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో భార్య మాధవి ఫోన్ చేయగా అశోక్ ఫోన్ ఎత్తలేదు. దీంతో ఆమె వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూసేసరికి అశోక్ పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో కనిపించాడు. వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇచ్చి అశోక్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పకి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మైసయ్య తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భూ తగాదాలతో వ్యక్తిపై గొడ్డలితో దాడి



గాయపడిన మిర్యాల శేఖర్‌రెడ్డి

తాళ్లగడ్డ (సూర్యాపేట): భూ తగాదాలతో వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన సూర్యాపేట మండలం తాళ్ల ఖమ్మంపహాడ్‌లో శనివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్ల ఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన మిర్యాల శేఖర్‌రెడ్డి(47) గ్రామంలో తనకున్న ఒక గుంట స్థలంలో చెట్లను కొట్టేసి చదును చేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన ఎస్‌కే గౌస్, ఎస్‌కే సమీర్, ఎస్‌కే మైమూద్, ఎస్‌కే మల్సూర్, ఎస్‌కే అమీరా, ఎస్‌కే మున్నాబి పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని మిర్యాల శేఖర్‌రెడ్డిపై గొడ్డలి, మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శేఖర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి మిర్యాల అమృతారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట రూరల్ ఎస్‌ఐ ఎన్. బాలునాయక్ తెలిపారు.

సెలవుల్లో.. కంప్యూటర్ శిక్షణ

సమ్మర్ స్పెషల్

- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు, యువత
- క్రీడలతో సమానంగా పిల్లలకు నేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు



కంప్యూటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తాళ్లగడ్డ (సూర్యాపేట): ఒకప్పుడు వేసవి సెలవులు వచ్చాయంటే చాలు విద్యార్థులు, యువత తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ లేదా స్విమ్మింగ్, కరాటే, స్పోకెన్ ఇంగ్లిష్ వంటివి నేర్చుకునేవారు. మరికొందరు సంగీతం, వివిధ రకాల కళలను నేర్చుకునేవారు. కానీ ప్రస్తుత ఆధునిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు వేసవి సెలవుల్లో కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ఇప్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకనుగుణంగానే పట్టణాల్లో కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లు విద్యార్థులు, యువతతో కళకళలాడుతున్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల యువత, విద్యార్థులు వేసవి సెలవుల్లో ప్రతిరోజు వచ్చి కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లలో చేరి శిక్షణ పొందుతున్నారు. కొందరు ఉపాధి కోసం మరికొందరు ఉన్నత చదువుల కోసం, ఇంకొందరు ఉద్యోగోన్నతి కోసం కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్నారు.

ఆకట్టుకుంటున్న నిర్వాహకులు..

సూర్యాపేట పట్టణంలో కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌ల సంఖ్య పెరగడంతో పోటీని తట్టుకునేందుకు పలువురు నిర్వాహకులు ఫీజులో రాయితీ కూడా కల్పిస్తున్నారు. వేసవి కాలం కావడంతో ఎక్కువగా యువత, చిన్నారులు శిక్షణకు వస్తుండటంతో బ్యాచ్‌కు 10 నుంచి 5 మంది చొప్పున, ప్రతిరోజు 10 బ్యాచ్‌ల వరకు నడుపుతున్నారు. నెల రోజులు పాటు ఇచ్చే శిక్షణకు గాను రూ.2000 వరకు తీసుకుంటున్నారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వహించి కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందిన ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందజేస్తున్నట్లు పలువురు నిర్వాహకులు తెలిపారు.

ఫోన్ వద్దని కంప్యూటర్ క్లాసులకు..



ఇంటి దగ్గర ఫోన్ వాడుతుండటంతో మా అమ్మానాన్నలు ఫోన్‌కి బదులుగా జీవితంలో ఉపయోగపడే కంప్యూటర్ నేర్చుకోమని ఇనిస్టిట్యూటల్‌లో జాయిన్ చేశారు. కంప్యూటర్ కొంతమేర నేర్చుకున్నాను. చాలా హ్యాపీగా ఉంది. – ఈషాన్, 8వ తరగతి, సూర్యాపేట

కొన్ని కోర్సులకు మంచి డిమాండ్

యువత కంప్యూటర్ కోర్సులో ఎంఎస్ ఆఫీస్ నేర్చుకునేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. ఆ తర్వాత ఫొటోషాప్, డీటీపీ, టాలీ, ఆటో కాడ్ వంటి కోర్సులు నేర్చుకుంటున్నారు. వీటి తర్వాత పీజీడీసీఏ ఆరు నెలల కోర్సు కావడంతో అవసరం ఉన్న వారు మాత్రమే దానిని ఎంచుకుంటారు. శిక్షణ పొందిన వారు కొందరు ఇంటర్‌నెట్ సెంటర్లలో, కాలేజీలు, ఆస్పత్రుల్లో కంపూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

భవిష్యత్ కోసం..



నేను పదో తరగతి పూర్తి చేశాను. సూర్యాపేట పట్టణానికి 15 కిలోమీటర్ల దూరం ఉన్న గుంజలూరు నుంచి రోజూ వచ్చి కంప్యూటర్ నేర్చుకుంటున్నాను. ఉన్నత చదువుల కోసం, భవిష్యత్‌లో ఉద్యోగ ప్రయత్నాల్లో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎంఎస్ ఆఫీస్ నేర్చుకుంటున్నాను. – ప్రదీప్, 10వ తరగతి, గుంజలూరు

ఉపాధి పొందేందుకు ఉపయోగం



వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రస్తుతం సూర్యాపేట పట్టణంలోని ఈసీఎస్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌లో టాలీ నేర్చుకుంటున్నాను. కాల వ్యవధి లోగా టాలీపై పట్టు సాధించి ఏదైనా ప్రైవేట్ ఉద్యోగంలో చేరాలనేదే నా లక్ష్యం.. – నసీర్, డిగ్రీ, సూర్యాపేట

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా కంప్యూటర్ అనుసంధానంగానే పనులు జరుగుతున్నాయి. గతంతో అవసరం ఉంటేనే కంప్యూటర్ నేర్చుకునేవారు.. కానీ నేడు కంప్యూటర్ నేర్చుకొని ఉండటం తప్పనిసరి. శిక్షణ అనంతరం కొంత మందికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నాము. మా వద్ద శిక్షణ తీసుకున్న వారు కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. – ఎండీ మహ్మద్, కంప్యూటర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు

యాదగిరి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



దర్శనం కోసం ముఖ మండపం క్యూలో నిల్చున్న భక్తులు

- 40వేలకు పైగా దర్శించుకున్న భక్తులు
- ధర్మ దర్శనానికి 3గంటలకు పైగా సమయం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వేసవి సెలవులు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ముఖ మండపం, ప్రసాద విక్రయశాల, ఇతర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అధికంగా రావడంతో ధర్మ దర్శనానికి 3గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామిని 40వేలకు పైగా భక్తులు దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.42,32,003 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

నృసింహుడి సన్నిధిలో విశేష పూజలు..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామి, అమ్మవార్లకు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం చేపట్టారు. సాయంత్రం జోడు సేవలను మాడ వీధిలో ఊరేగించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా..?

- క్యూలైన్లలో భక్తుల సమస్యలు తెలుసుకున్న ఈఓ వెంకట్రావ్



ముఖ మండపం క్యూలైన్‌లో భక్తులతో మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్

వేసవి సెలవుల్లో శ్రీయాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. శనివారం సుమారు 40వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వెంకట్రావ్ శనివారం క్యూలైన్లలో, మాఢ వీధుల్లో తిరుగుతూ భక్తుల సమస్యలు తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా అని భక్తులను అడిగారు. ఎండల తీవ్రతకు, ఉక్కపోతకు భక్తులు ఇబ్బందులుపడకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో వెంట్రావ్ పేర్కొన్నారు. కొండ కింద శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం వెంటనే ఏసీలు బిగించాలని అధికారులను ఆదేశించారు. వ్రత పూజల్లో పాల్గొనే భక్తులకు సామాగ్రీ, రవ్వ ప్రసాదంతో పాటు అదనంగా శ్రీస్వామి వారి శేష వస్త్రం (శెల్లా, కనుము) అందజేసేందుకు ఏర్పాటు చేయాలని ఆధికారులకు చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ ఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ ఉన్నారు.

వృద్ధురాలిపై దాడి చేసి ఆభరణాల అపహరణ



దొంగల దాడిలో గాయపడ్డ లక్ష్మమ్మ

నకిరేకల్: వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి ఆమె మెడలోని బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో శనివారం జరిగింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకలపట్టణంలోని వీటీ కాలనీలో నివాసముంటున్న స్థానిక పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు తల్లి లక్ష్మమ్మ ఇంటికి శనివారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అద్దెకు రూములు కావాలంటూ వచ్చారు. తమ ఇంట్లో అద్దెకు రూములు లేవని లక్ష్మమ్మ వారికి చెప్పింది. తాగడానికి మంచినీళ్లు కావాలని సదరు వ్యక్తులు ఆమెను అడిగారు. దీంతో మంచినీళ్లు ఇచ్చేందుకు లక్ష్మమ్మ ఇంట్లోకి వెళ్తుండగా.. ఆమెపై ఆ ఇద్దరు వ్యక్తులు దాడి చేసి కాళ్లు, చేతులు కట్టివేశారు. లక్ష్మమ్మ కేకలు వేయడంతో ఆమె నోట్లో గుడ్డలు పెట్టి మొహంపై పిడుగుద్దులు గుద్దారు. అనంతరం ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసులు, చేతులకు ఉన్న వెండి గాజులు లాక్కొని పరారయ్యారు. కొద్దిసేపటి తర్వాత లక్ష్మమ్మ చేతి కట్లు విప్పుకుని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. వెంటనే ఆమె కుమారుడు వెంకటేశ్వరావు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ లచ్చిరెడ్డి తమ సిబ్బందితో లక్ష్మమ్మ ఇంటికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి క్లూస్‌టీంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దుండగుల దాడిలో గాయపడిన లక్ష్మమ్మను నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మను ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు.

వృద్ధ మహిళలే టార్గెట్..

వృద్ధ మహిళలనే టార్గెట్ చేస్తూ కొన్ని రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం నకిరేకల్ మండలం మర్రూర్ గ్రామంలో పుట్ట చంద్రమ్మ అనే వృద్ధురాలు తన ఇంటి బయట కూర్చొని ఉండగా గుర్తుతెలియన ఇద్దరు యువకులు వచ్చి తన మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు అపహరించారు.

జైన మందిర్‌ను సందర్శించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం

ఆలేరురూరల్: ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో గల జైన మందిరాన్ని శనివారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మందిర్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని ఓ లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టలోని లక్ష్మీ థియేటర్ వెనుక లక్ష్మీనరసింహ ఫ్యామిలీ రూమ్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తితో కలిసి మహిళ దిగింది. శనివారం తెల్లవారు జామున 5.40గంటలకు మహిళతో వచ్చిన వ్యక్తి బయటకు వెళ్లిపోయాడు. బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి లాడ్జికి రాకపోవడంతో లాడ్జి నిర్వాహకుడు భరత్ వారి గది వద్దకు వెళ్లి చూడగా.. సదరు మహిళ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పట్టణ ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతురాలి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయని ఎస్‌ఐ తెలిపారు. విచారణ అనంతరం మహిళ వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ పేర్కొన్నారు. లాడ్జి నిర్వాహకుడు భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహిళతో వచ్చిన వ్యక్తి హత్య ఉండాటా.. లేదా ఇద్దరి మధ్య ఏదైనా ఘర్షణ జరిగి మహిళే ఉరి వేసుకుందా.. ఇతర ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధం

చండూరు: చండూరు మండలం తాస్కానిగూడెంలో శనివారం ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు ఇరిగి లింగయ్య పూరిగుడిసె నుంచి మంటలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి లింగయ్యకు సమాచారం ఇచ్చారు. గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ తెప్పించి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా.. అప్పటికే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

సూర్యాపేట డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో విచారణ



సూర్యాపేట జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో విచారణ చేస్తున్న రాష్ట్ర వైద్య బృందం సభ్యులు

సూర్యాపేటటౌన్: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించి నడుస్తున్న సూర్యాపేట జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో సూర్యాపేట కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రజారోగ్యశాఖ ఉన్నతాధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం సభ్యులు పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పర్సనల్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్, డిప్యూటీ సీఎస్ పీసీపీ ఎన్డీటీ డాక్టర్ సుమిత్రా రాణి, డిపూట్యీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అడ్మిన్ శ్వేతా మోహన్.. డీఎంహెచ్‌ఓ కోటాచలాన్ని విచారించారు. సూర్యాపేటలో నాలుగు ఆస్పత్రుల పర్మిషన్‌కు సంబంధించిన సర్టిఫికెట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి పరిశీలన అనంతరం తీసుకునే చర్యల సంబంధిత వివరాలను రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవిచంద్రనాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ పంపిస్తామన్నారు.

విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్త

- కంపెనీల ప్రకటనలు చూసి రైతులు మోసపోవద్దు



పెద్దవూర: మరో పది హేను రోజుల్లో వానాకాలం సాగు ప్రారంభం కానుంది. రైతులు బోర్లు, బావుల కింద పత్తి విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు పత్తి, మిరప విత్తనాలను సైతం కొనుగోలు చేశారు. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో రైతులు జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందని పెద్దవూర మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచిస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ప్రారంభిస్తున్నాయని, వాటిని చూసి విత్తనాలు కొనుగోలు చేయొద్దని పేర్కొన్నారు. విత్తనాలు, పురుగుల మందు కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

విత్తనాల ఎంపిక..

- వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాల కొనుగోలు రశీదులపై నంబర్, విత్తన రకం, కొనుగోలు తేదీ, డీలర్, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి.
- గడువు దాటిన విత్తనాలు, వదులుగా, చిరిగిన ప్యాకెట్లు కొనుగోలు చేయొద్దు.
- రశీదుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకాల పన్ను నంబర్, విక్రయదారుడి గ్రామం పేరు, సంతకం, విత్తన రకం, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, తూకం, ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్ద తూకం వేయించాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వ్యవసాయశాఖ అధికారి, శాస్త్రవేత్తలను సంప్రదించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన రశీదును పంట కాలం పూర్తయ్యే వరకు ఉంచుకోవాలి.
- విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉన్న వాటినే విత్తనాలుగా వాడాలి.

పురుగు మందుల ఎంపిక..

- పంటలో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగుల మందులు కొనుగోలు చేయాలి.
- అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగుల మందులను వాడొద్దు.
- పురుగు మందు డబ్బాలపై చక్రాకారంలో రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడకూడదు. వాడిన డబ్బాలు, సీసాలు ధ్వంసం చేసి గుంతలో పూడ్చిపెట్టాలి.
- ఒక పంటకు వాడిన మందును మరో పంటకు శాస్త్రవేత్తల సూచనలతో వాడాలి.

ఎరువుల ఎంపిక..

- లైసెన్స్ కల్గిన దుకాణాల్లోనే ఎరువులు కొనాలి. బిల్లులు, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వాడాలి. చేతికుట్టుతో ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా ఉండాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వ్యవసాయ అధికారి సహకారంతో పరీక్షలకు పంపాలి.
- చిల్లులు పడి, చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయొద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీగా గుర్తించాలి.

కల్తీలను గుర్తించండిలా..

- యూరియా, కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్ ఎరువులుగుళికలుగా ఉంటాయి.
- ఎరువులు ఇసుక రేణువుల రూపంలో, పొటాష్, సూపర్ ఫాస్పేట్ పొడి రూపంలో ఉంటాయి.
- 5 మి.లీ. నీటిలో చెంచా ఎరువు వేసి బాగా కలిపితే స్వచ్ఛమైన ద్రావణంగా తయారైతే నాణ్యమైన ఎరువుగా గుర్తించవచ్చు. యూరియా, అమ్మోనియా క్లోరైడ్ ఎరువుల పరీక్షకు 10 మి.లీ. పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి.
- ఒక చెంచా యూరియాను ఐదు మి.లీ. పరిశుభ్రమైన నీటిలో వేసి కలిపితే అడుగున మట్టి చేరితే కల్తీగా గుర్తించాలి. కొన్ని కాంప్లెక్స్ ఎరువులను ఇలాగే పరీక్షిస్తే ఇసుక రేణువులు వచ్చే అవకాశం ఉంది. అలా వచ్చినా కల్తీ ఎరువుగా గుర్తించాలి.